క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

దోమ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో అండగా నిలుస్తోందని బొంపల్లి మాజీ సర్పంచ్ కోళ్ల సురేశ్ అన్నారు. సోమవారం గ్రామానికి చెందిన డీవీటి నరేశ్ కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సీఎం సహాయనిధి కింద రూ.56 వేలు చెక్కును మంజూరు చేయించారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి మాజీ సర్పంచ్ బాధితుడిని చెక్కును అందజేశారు. అనంతరం గొడుగోనిపల్లి గ్రామంలో మంగళి సరస్వతి, హరిజన్ బసప్పకు సైతం సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మల్లారెడ్డి, బాల్‌రాజ్, చంద్రశేఖర్, రాములు, మహేశ్, నర్సింహులు, భీమయ్య, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ టీం సభ్యులు

బంట్వారం: ధన్నారం సమీపంలోని యజ్ఞ ఫౌండేషన్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు కోట్‌పల్లి మండలం ఎన్నారానికి చెందిన ఫ్రెండ్స్ టీం సభ్యులు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనాథ పిల్లలకు యజ్ఞ ఫౌండేషన్ తోడుగా నిలవడం అభినందనీయమన్నారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేయటం తమకు చాలా సంతృప్తిని కలిగించిందని తెలిపారు. ఇక ముందు కూడా తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వీరిలో ఫ్రెండ్స్ టీం సభ్యులు అంజి, సమీర్, మక్సూద్, దాసు, రవి, మహబూబ్, ఆమోస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ మంజూరుకు వినతి



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చారు. కోట్‌పల్లికి చెందిన లెక్చరర్ కుమ్మరి శ్రీనివాస్ సోమవారం నగరంలో స్పీకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ప్రసాద్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. కళాశాల మంజూరుకు సంబంధించి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ అధికారులతో మాట్లాడి, లేఖ రాస్తానన్నారు. కాలేజీ మంజూరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు.

సులభతరంగా బోధనుండాలి



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

దౌల్తాబాద్: విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు పాఠాలను బోధించాలని మండల విద్యాధికారి వెంకట్‌స్వామి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోకఫసల్వాద్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పిల్లలకు డిజిటల్ క్లాసుల ద్వారా బోధన ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా చదివేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎంలు శ్రీహరి రెడ్డి, రాజు, హన్మంత్‌గౌడ్, ఏఏపీసీ చైర్మన్ యశోద తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

యాలాల: రాగి జావతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని తాండూరు ఏఎంసీ డైరెక్టర్ గోనేగారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పేరి రాజేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రంలో రాగిజావ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేలా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, మారుతి, నర్సింహులు, చంద్రశేఖర్, వెంకటయ్య, మల్లేశం, లక్ష్మప్ప ఉన్నారు.

తగ్గిన నీళ్లు.. రైతు దిగాలు!

- హస్నాబాద్ చెరువులో క్రమేణా తగ్గుతున్న నీటిమట్టం
- తటాకం కింద 500 ఎకరాల వరకు వరి సాగు
- అయోమయంలో అన్నదాతలు



పంటలకు నీరందిస్తూ దిగాలుగా కూర్చున్న రైతులు



తూము వద్ద తగ్గిన నీటి సామర్థ్యం

దుద్యాల్: అసలే వేసవి కాలం.. ఎండలు తీవ్రమవ్వడంతో చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. దీంతో రోజురోజుకూ నీటి నిల్వల సామర్థ్యం తగ్గుముఖం పడుతోంది. ఫలితంగా ఆయా ఆయకట్టు కింద పంటలు సాగు చేసుకున్న రైతుల్లో కలవరపాటు మొదలైంది. మండల పరిధిలోని హస్నాబాద్ పెద్ద చెరువు కింద సాగయ్యే వరి పంట ప్రస్తుతం పాలు తాగే దశలో(గింజలుగా మారడం) ఉంది. ఈ సమయంలో నిరంతరం నీటిని అందించాలి. కానీ చెరువు అడుగంటే స్థితికి చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలు కొంత ఊరట కలిగించినా.. మే నెలలో వచ్చే ఉష్ణ ప్రతాపానికి పంటలు ఎలా తట్టుకుంటాయని కర్షకులు మదన పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలతో పంటలు చేతికొస్తాయా లేదా అనే మీమాంస కొనసాగుతుంది.

పెరిగిన నీటి వాడకం

పెద్ద చెరువు పూర్తిగా నిండుకుంటే ఆయకట్టు కింద సుమారు 945 ఎకరాల వరి సాగయ్యేది. అలాగే చెరువులో దాదాపు 6 గజాల నీటి నిల్వ ఉండేది. క్రమంగా చెరువు పూడి పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ప్రస్తుతం అలుగు పారితే దాదాపు 700 ఎకరాల వరకు పంటలు సాగయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడకపోవడంతో చెరువు అలుగు పారలేదు. దీంతో నీటి నిల్వ తక్కువగా ఉండడంతో డిసెంబర్ మాసంలో అంచనా ప్రకారం దాదాపు 400 ఎకరాల వరకు సాగు అవుతాయని తైబందు చేశారు. దానికంటే ఎక్కువే అధికంగా పంటను సాగు చేసుకున్నారు. దీంతో చెరువులో నీటి వాడకం పెరిగిపోయింది. సాగయ్యే పంటలకు ఏ మేరకు నీటిని అందిస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

వారానికి ఒక తడి

ప్రస్తుతం చెరువులో నీటి నిల్వ సామర్థ్యం దృష్టిలో ఉంచుకుని వారానికి ఒక రోజు పంటలకు నీరు అందిస్తున్నారు. ఇష్టానుసారంగా నీటిని వృథా చేయకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రతి ఏడాది కంటే ఈసారి నీటిని పొదుపుగా వాడుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. దిగుబడి చేతికొచ్చే వరకు ఎలా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు.

నీటి వృథా లేదు



చెరువు కింద దాదాపు 500 ఎకరాల వరకు వరి పంట సాగవుతుంది. చెరువులో నీరు తగ్గుతుండడంతో ఈ సంవత్సరం మరింత జాగ్రత్త పడుతున్నాం. పంటలు ఎండిపోయే అవకాశం లేకుండా వారానికి ఒక రోజు తడులు అందిస్తున్నాం. అందుకు రైతులు కూడా సహకరిస్తున్నారు.

– మల్లేశం, రైతు, హస్నాబాద్

పౌష్టికాహారంపై అవగాహన

యాలాల: అంగన్‌వాడీ చిన్నారులకు ఆట ఆధారిత అభ్యాసం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఐసీడీఎస్ యాలాల సెక్టార్ సూపర్‌వైజర్ మీనాక్షి అన్నారు. సోమవారం మండలంలోని ముకుందాపూర్‌లో సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ సంసిద్ధత గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తామన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార లోపం లేకుండా చూస్తామన్నారు. తల్లి పాల ప్రాముఖ్యత, చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసం సంబురాలు

దోమ: గ్రామాలలో పోషణ మాస సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం మండల పరిధిలోని పాలేపల్లి అంగన్వాడీ సెంటర్‌లో సూపర్‌వైజర్ జగణమ్మతో కలిసి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు, చిన్నారులకు అన్నప్రాస, అక్షర అభ్యాసం, శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.



దోమ: గర్భిణులకు పండ్లు అందజేస్తున్న అంగన్వాడీ సిబ్బంది

ర్యాంకుల ప్రచారంపై చర్యలు తీసుకోండి

తాండూరు టౌన్: తప్పుడు ర్యాంకులను ప్రచారం చేస్తున్న శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఒకే విద్యార్థి రెండు సంస్థల్లో చదివినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. తప్పుడు ఫలితాలను ప్రచారం చేస్తూ తమ సంస్థల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరేలా, తద్వారా ఫీజుల రూపంలో కోట్లాది రూపాయలను సంపాదిస్తున్న శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థల యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చీటింగ్ కేసులు పెట్టాలని ఎంఈఓ వెంకటయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేత అశోక్ ఉన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వసతుల్లేక.. తడిసిన ధాన్యం

దోమ: మండల పరిధిలోని రాకొండ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతుల లేమి కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఐదు రోజుల క్రితం కేంద్రాన్ని ప్రారంభించగా.. గొనే సంచులు, సుత్తిళ్లు, టార్పలిన్లు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మూడు రోజుల నుంచి అకాల వర్షాలు దంచి కొట్టడంతో ధాన్యం రాశులు తడిసి ముద్దవుతున్నాయి. కనీసం కవర్లు సైతం ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహానికి గురవుతున్నారని మండిపడ్డారు. దీంతో కొందరు సొంతంగా టార్పలిన్లు సమకూర్చుకుంటున్నారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి సైతం ఓ ప్రకటనలో సోమవారం మండిపడ్డారు. కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



ధాన్యం రాశులపై కవర్లు కప్పిన రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల పారంభం



దౌల్తాబాద్: దేవర్‌ఫసల్‌వాద్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



దుద్యాల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోళ్లు చేపట్టాలని సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సేవ్యానాయక్, రాములు, కోఆపరేటివ్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈఓ అనంతయ్య, మాజీ సర్పంచ్ వెంకట్రాములు తదితరులున్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని తుంకిమెట్ల, బొంరాస్‌పేట, రేగడిమైలారం, కొత్తూరు, వడిచర్ల, బాపల్లి, ఏర్పుమళ్ల గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, డైరెక్టర్ మల్లేశం, నాయకులు వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, గుండప్ప, ఏఓ తులసి, ఏఈఓ శిరీష, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దుద్యాల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఏసీఎస్ ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసా పోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు భావన, కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు ఖలీల్ పాషా, మాజీ సర్పంచ్ ఖాజా, నాయకులు కృష్ణ, ముజీప్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగించుకోండి

దోమ: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ యాదగిరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని శివారెడ్డిపల్లి, బొంపల్లి, ఖమ్మంనాచారం, మోత్కూర్, కొండాయపల్లి గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓలు బాబ్య, హారిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు

పాఠశాల స్లాబ్ మరమ్మతులకు చర్యలు

బంట్వారం: శిథిలావస్థలోని పాఠశాల తరగతి గదుల స్లాబ్ పెంకుల మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కోట్‌పల్లి ఎంపీడీఓ డానియల్ అన్నారు. సోమవారం ఆయన ఎంఈఓ చంద్రప్పతో కలిసి బార్వాద్ తండా, మద్గుల్ తండా, మోత్కుపల్లి, జిన్నారం, కంకణాలపల్లి పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బార్వాద్ తండా, మద్గుల్ తండాల్లోని పాఠశాల తరగతి గదుల స్లాబ్ పెంకులు ఊడిపోయినట్లు గుర్తించామన్నారు. అలాగే మిగతా పాఠశాలల్లో కూడా నెలకొన్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ జితేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'చలో వరంగల్'ను విజయవంతం చేద్దాం

ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు శివకుమార్



యాలాల: బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా వరంగల్‌లో చేపడుతున్న సభను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, చెన్నారం మాజీ సర్పంచ్ ఆకుల శివకుమార్ కోరారు. పార్టీ రజతోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభకు యాలాల మండలం నుంచి భారీగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. పార్టీ ఆదేశాల మేరకు సభకు వెళ్లేందుకు వాహన ఏర్పాట్లు ఉన్నాయని, గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు జన సమీకరణకు ఇప్పటి నుంచే మొదలు పెట్టాలని సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి ఆదర్శం



మాధురిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

యాలాల: ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో విధులు నిర్వహించి, ఎందరో విద్యార్థుల ఉన్నత స్థాయికి జీహెచ్‌ఎం మాధురి నిలిచారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడియాల చంద్రశేఖర్, అమర్‌నాథ్ అన్నారు. సోమవారం దేవనూరు జీహెచ్‌ఎం మాధురి పదవీ విరమణ చేయబోతున్న సందర్భంగా పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 1988లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన మాధురి, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం పలువురు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి రాములు, ఎంఈఓ రమేష్, బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, నాయకులు మొగులయ్య, ప్రభాకర్‌చారి, మహేష్, విజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలల సందర్శన

బంట్వారం: కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ రాములు సోమవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలన్నారు. శిథిలావస్థలోని భవనాల్లో తరగతి గదుల స్లాబ్‌ల పెంకులు ఊడినట్‌లతై మరమ్మతులు చేయిస్తామన్నారు. ఇందుకు సంబంధించి నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, ఏఈ లక్ష్మణ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు తదితరులు

కూరగాయలు స్వేచ్ఛగా అమ్ముకోనివ్వాలి

గుడిమల్కాపూర్ రైతు సంఘం అధ్యక్షుడు కొమ్మిడి దశరథ్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: గుడిమల్కాపూర్ మార్కెట్‌లో రైతులకు స్వేచ్ఛగా కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని గుడిమల్కాపూర్ రైతు సంఘం అధ్యక్షుడు కొమ్మిడి దశరథ్‌రెడ్డి రైతులతో కలిసి మార్కెట్ చైర్మన్ తలారి మల్లేశ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌ను కోరారు. సోమవారం ఈ విషయమై మండల పరిధిలోని బాకారం గ్రామానికి చెందిన రైతులు, కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ మహేందర్‌ముదిరాజ్‌తో కలిసి దశరథ్‌రెడ్డి వారికి వివరించారు. ప్రస్తుతం గుడిమల్కాపూర్ మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన కూరగాయలను హోల్‌సేల్‌గా అమ్మాలని నిబంధనలను పెట్టడంతో రైతులకు నష్టం కలుగుతుందని ఆరోపించారు. రైతులు పండించే పంటలు హోల్‌సెల్‌తో పాటు స్వేచ్ఛగా అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీంతో వారు దీనిని పరిశీలిస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో రైతులు రవీందర్‌రెడ్డి, కిష్టయ్య, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె

షాద్‌నగర్: విద్యార్థులలో ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనం ఆవరణలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సెల్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో పాటు విషయ పరిజ్ఞానంతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. భవిష్యత్‌లో మరెన్నో సమస్యలకు సృజనాత్మకంగా ఆవిష్కరణలు చేపట్టే దిశగా విద్యార్థులు ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీబీసీ కన్వీనర్ పద్మజ, ఐబీసీ కన్వీనర్ స్పందన, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సృజన, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రమణమ్మ, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



ఇన్నోవేషన్ సెల్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

ప్రభుత్వ బడులను వినియోగించుకోండి

ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం

కొడంగల్: మండల పరిధిలోని ఉస్సేన్‌పూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. సర్కారు పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు ఉంటాయని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు ఇవ్వడంతో పాటు ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతున్నట్లు చెప్పారు. గ్రామంలో మూడేళ్లు దాటిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం క్రాంతికుమార్ ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

దోమ: గ్రామాలలోని పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని మెరుగైన విద్యను నేర్చుకోవాలని ఎంఈఓ వెంకట్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని మోత్కూర్, బుద్లాపూర్, గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను బడికి పంపించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని అన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ నుంచి నర్సరీ, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, పాండు, పంచాయతీ కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, రాములు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సువర్ణ, భీమ్లా, మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



దోమ: కిష్టాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ వెంకట్



కొడంగల్: విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్న హెచ్‌ఎం